క్లుప్తంగా

అడవుల రక్షణ అందరి బాధ్యత


విధి నిర్వహణలో అమరులైన వారికి నివాళులు అర్పిస్తున్న అటవీశాఖ అధికారులు

గొలుగొండ: అడవుల రక్షణలో విధి నిర్వహణ చేస్తున్న సమయంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరికి అటవీశాఖ అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ వారి కుటుంబాలకు తోడుగా ఉంటామని కృష్ణదేవిపేట అటవీశాఖ రేంజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులైన అటవీ సిబ్బందికి పూల మాలతో నివాళులు అర్పించారు. అడవులు రక్షణ వల్లనే పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తామరం ఇన్‌చార్జ్ వీఆర్వోగా సాంబశివరావు

మాకవరపాలెం : తామరం ఇన్‌చార్జ్ వీఆర్వోగా రాచపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న సాంబశివరావును నియమించారు. తామరం వీఆర్వో లక్ష్మణరావు భూమి మ్యుటేషన్‌కు రూ.15,000 లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా సాంబశివరావును నియమించినట్టు తహసీల్దార్ రామారావు తెలిపారు.

ముగిసిన దివ్య అఖండ నామ సంకీర్తన


కొత్తపల్లిలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లి గ్రామంలో సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన దివ్య అఖండ నామ సంకీర్తన కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. లోక కల్యాణార్థం అత్యంత భక్తి శ్రద్ధలతో శనివారం సాయంత్రం ప్రారంభమైన అఖండ నామ సంకీర్తన 24 గంటల పాటు ఏకధాటిగా కొనసాగించి ఆదివారం సాయంత్రంతో ముగించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఈ దివ్య అఖండ నామ సంకీర్తన జరిగింది. అనకాపల్లి జిల్లాలో 11 చోట్ల ఈ అఖండ నామ సంకీర్తన జరిగినట్టు సత్య సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్, రవిశంకర్, ఆదిరెడ్డి చిన కన్నబాబు, సూర్యం, పెంటారావు పాల్గొన్నారు.

నేడు గవరపాలెంలో గ్రామసభ

కె.కోటపాడు : మండలంలో గవరపాలెం గ్రామంలో సోమవారం రీసర్వే- గ్రామసభను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాగ్యావతి పేర్కొన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు గల వారు సమావేశంలో అధికారులకు అర్జీలు అందించాలని కోరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ నిర్వహించే ఈ గ్రామసభను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

గొలుగొండ : విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదువుకొని మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని గ్రంథాలయ అధికారి రాజుబాబు తెలిపారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. దీనికి గురుకుల కళాశాల, స్థానిక విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు.

ప్రత్యేక ఓటరు శిబిరానికి స్పందన

రోలుగుంట : రెండు రోజుల ఓటరు జాబితా సవరణ ప్రత్యేక ప్రచార కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మండలంలో గల 43 పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ ఎస్.నాగమ్మ పర్యవేక్షణలో బీఎల్వోలు ఓటర్ల దరఖాస్తులు స్వీకరించారు. 18 ఏళ్లు నిండిన వారి నుంచి ఓటరుగా ధ్రువీకరణం పత్రాలు స్వీకరించారు. ఓటరు కార్డుల్లో పేర్లు, చిరునామాల తప్పులను సవరణ చేశారు.


కొండ దిగువనున్న కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం


కొండపైనున్న జగ్గారాయడి ఆలయం


తుప్పలతో నిండి భక్తులకు అసౌకర్యంగా ఉన్న మార్గం

ఆహ్లాదం...ఆధ్యాత్మిక విహారం

- శైవ, వైష్ణవ ఆలయాల సమాహారంగా రోలుగుంట
- ఒకే ప్రాంతంలో వెలసిన పలు దేవాలయాలు
- నిత్యం భక్త జనంతో కిటకిట
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్న స్థానికులు


కొండల నడుమ శ్రీ వేంకటేశ్వర ఆలయం

రోలుగుంట : మండల కేంద్రంలో కొండల నడుమ గల వేంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ ఉన్న పచ్చదనం భక్తులకు ఆహ్లాదం కలిగిస్తుంది. గంటల తరబడి యాత్రికులు, భక్తులు ఇక్కడ గడపడానికి ఎంతో ఇష్టపడతారు. మండల వాసులే కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు తరలి వచ్చి కోనేరులో స్నానాలు ఆచరించి కొండ దిగువనున్న శ్రీ విశాలక్షి కాశీ విశ్వశ్వర మృత్యుంజయుని దర్శించుకుంటారు. ఇక్కడ మెట్ల పై నుంచి శ్రీ వేంకటేశ్వర దేవాలయాన్ని భక్తులు సందర్శిస్తారు. ఎంతో విశిష్టత గల ఈ ఆలయంలో ప్రతి శనివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేసుకుంటారు. ఈ ఆలయం పక్క నుంచి ఎత్తయిన ప్రదేశంలో ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయానికి మెట్ల మార్గంలో నడుచుకొని వెళ్లి దర్శించుకుని పూజలు చేసుకుంటారు. ఇక్కడ నుంచి ఎడమ భాగంలో మరొక కొండపై నున్న జగ్గారాయుడి గడికి వెళ్లి అక్కడ నాగదేవతను దర్శించుకుంటారు. వివాహం కాని యువతులు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తే వివాహం అవుతుందని భక్తుల విశ్వాసం. ఒకే చోట అన్ని ఆలయాలు ఉండడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక శోభ సంతరించుకుంది. అయితే ఈ ఆలయాలకు వచ్చే భక్తులకు తగిన సదుపాయలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొండల నడుమ ఆలయాల దర్శనానికి సరైన మార్గం లేదు. తుప్పలు, డొంకలతో నిండిన మార్గంలో రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఏటా భక్తులు, సందర్శకులు పెరుగుతుండడంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా రహదారి సదుపాయం మెరుగుపరిచి, భక్తులకు వసతులు కల్పిస్తే ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతుందని పలువురు కోరుతున్నారు.

పర్యాటకంగా గుర్తించాలి



నాలుగు దేవాలయాలు ఒకే చోట భక్తులకు అనువుగా ఉన్నాయి. కొండల నడుమ పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరమైన పరిసరాలు, ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ముఖ్యంగా కార్తీక వన సమారాధనకు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

-కాలింగ ప్రసాద్, జగ్గంపేట

ఆలయాలతో ఈ ప్రాంతానికి ఎంతో విశిష్టత



స్థానిక కొండపైన వెలసి ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆలయంలో నిత్యపూజలు జరుగుతాయి. ప్రతి శనివారం అభిషేకాలు నిర్వహిస్తాం. తిరుపతిలో మాదిరిగానే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ఎంతో విశిష్టత ఉన్న స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం.

-ముత్యాల సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు

దేవదాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతాం



ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తయారు చేయడానికి ఎంతో అవకాశం ఉంది. ఆలయాల మార్గంలో తుప్పలు, డొంకలు తొలగించి భక్తులకు అనువుగా రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం దేవదాయశాఖ మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళతాం.

-పోతల లక్ష్మీ రమణమ్మ, జెడ్పీటీసీ

అంగన్‌వాడీ చిన్నారులకు వితరణ


అంగన్‌వాడీ టీచర్లకు గిన్నె, గ్లాసు అందిస్తున్న వార్డు కార్యదర్శి రమణ

రోలుగుంట : మండలం బుచ్చింపేట గ్రామంలో గల నాలుగు అంగన్ వాడీ కేంద్రాల్లో గల 60 మంది చిన్నారుల కోసం గిన్నె, స్టీలు గ్లాసును ఆదివారం ఆ కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లకు గ్రామానికి చెందిన సోషల్ వర్కరు(వార్డు కార్యదర్శి) అని మిరెడ్డి రమణ అందజేశారు. తాను గత వారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సమయంలో కేంద్రంలో చిన్నారుల అవసరాన్ని గుర్తించి సొంత ఖర్చుతో వారికి గ్లాసు, బౌలు సమకూర్చినట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి అఖండ నామ సంకీర్తన


ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

గొలుగొండ : సత్యసాయిబాబు ఆలయంలో సత్యసాయి 99వ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎల్ పురం గ్రామంలో ఉన్న ఆలయంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు భజన కీర్తనలు ఆలపించారు. స్థానిక భక్తులు 24 గంటల పాట నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ భజన కార్యక్రమాలు ప్రతి రోజు సాయంత్రం సమయంలో నవంబర్ 23 వరకు నిర్వహించడం జరుగుతుందని సత్యసాయిబాబా ఆలయ కమిటీ తెలిపారు.

మోదకొండమ్మ ఆలయంలో కార్తీక సందడి


మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి కార్తీక తొలి ఆదివారం కావడంతో భక్తులతో అమ్మవారి ఆలయంలో కార్తీక సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయప్రాంగణం అంతా భక్తులతో నిండిపోవడంతో పండగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు ఇతర సభ్యులు ఉచితంగా ప్రసాదాలు, తాగునీరు అందజేసి అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఆలయ ధ్వజ స్తంభం ప్రతిష్ట


ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు


కాశీ అన్నపూర్ణేశ్వరస్వామికి పూజలు

బుచ్చెయ్యపేట : బంగారుమెట్ట గ్రామంలో కాశీ అన్నపూర్ణేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పలువురు అర్చకుల సమక్షంలో శాస్త్రోక్తంగా ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభ ప్రతిష్ట స్థాపన చేశారు. ఈ మహోత్సవంలో బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, వడ్డాది, లోపూడి, వీరవల్లి, భీమవరం తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హోమాలు నిర్వహించారు. ప్రత్యేక భజనలు చేసి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

బీజేపీకి రెండు పోస్టులేనా!

- నామినేటెడ్ పోస్టుల్లో తీరని అన్యాయం
- రాష్ట్ర బీజేపీ కిసాన్‌మోర్చా కార్యదర్శి ధర్మిశెట్టి నారాయణరావు

మాడుగుల రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండవ దఫా నామినేటెడ్ పోస్టులు భర్తీలో కూటమిలో మిత్ర పక్షమైన బీజేపీకి తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్ర బీజేపీ కిసాన్‌మోర్చా కార్యదర్శి ధర్మిశెట్టి నారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన పోతనపూడిలో మాట్లాడుతూ రెండవ దఫా నామినేటెడ్ పోస్టుల్లో కూటమిలో మిత్రపక్షమైన బీజేపీకి కేవలం రెండు నామినేటెడ్ పోస్టులు మాత్రమే ఇచ్చారని అన్నారు. వీటి సంఖ్య పెంపుదల చేయాలని ఆయన కోరారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధిష్టానం కూడా కూటమి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొని రావాలన్నారు.

పండగను తలపించేలా..

- హెల్పింగ్ హార్ట్స్ అధ్వర్యంలో బాలల దినోత్సవం




బాలల దినోత్సవ కార్యక్రమంలో చిన్నారుల సందడి

నాతవరం : బాలలు దినోత్సవ కార్యక్రమాన్ని పండగ వాతావరణాన్ని తలపించేలా నిర్వహించడం చాలా ఆనందాయకమని జిల్లా కార్మిక శాఖ అధికారి వై.రమ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్పింగ్ హార్ట్స్ సంస్థ 800 మంది చిన్నారులతో ముందుగా బాలల దినోత్సవం నిర్వహించడం బాలల్లో ఎంతో ఉత్తేజాన్ని నింపిందన్నారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన సృజనాత్మకతకు అద్దం పడుతుందన్నారు. నర్సీపట్నం చెందిన ప్రముఖ విద్యావేత్త బంగార్రాజు మాట్లాడుతూ హెల్పింగ్ హార్ట్స్ వారిని అభినందించారు. మెగా వైద్య శిబిరం, చిన్నారుల నృత్య ప్రదర్శన, వైజాగ్‌కు చెందిన ప్రసాద్ మ్యాజిక్ షో నిర్వహించారు. అనంతరం ప్రోత్సాహకాలు అందజేశారు. ఎంఈవో వరహాల బాబు, మాజీ ఎంపీపీ కొండబాబు, ప్రాజెక్టు మేనేజరు కె.త్రినాథ్, కమిటీ సభ్యులు సౌమ్య నాయుడు గుప్తా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

జంపెన శివాలయంలో కార్తీక దీపారాధన

మాడుగుల : మండలంలో జంపెన శివాలయం పరిదిలో పెద్దేరు నదిలో కార్తీక రెండో సోమవారం సందర్భంగా దీపారాధన ప్రత్యేక అభిషేకాలు జరగనున్నాయని, ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమానికి మండలంలో గల శివభక్తులు హాజరు కావాలని కమిటీ కోరింది.

బరబాటి పంట సాగుపై రైతుల ఆసక్తి


రామచంద్రపురంలో సాగులో ఉన్న బరబాటి పంట

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో బరబాటి పంటను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. తక్కువ కాల వ్యవధిలోనే దిగుబడి ప్రారంభమయ్యే పంట కావడంతో బరబాటి పంట సాగువైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో సాగవుతున్న బరబాటి పంట ప్రస్తుతం పూతదశలో ఉంది. నీటి లభ్యత ఉన్న బావులు, మోటార్‌లు ఉన్న పొలాల వద్ద రైతులు బరబాటి సాగు చేస్తున్నారు. కింతాడ, జోగన్నపాలెం, రామచంద్రపురం, మర్రివలస, లంకవానిపాలెం, పిండ్రంగి, కె.సంతపాలెం, ఆర్లి, దాలివలస, కె.సంతపాలెం గ్రామాల్లో ఈ పంటను 90 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం

- మూడు దశాబ్దాల తర్వాత కలిసిన కాలేజీ మిత్రులు
- నాటి అధ్యాపకులకు ఘన సత్కారం


చోడవరం ప్రభుత్వ కాలేజీలో 30 ఏళ్ల క్రితం చదివిన ఇంటర్ పూర్వ విద్యార్థులు

చోడవరం : మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులంతా ఆనందంతో పులకించిపోయారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకే చోట చేరడంతో నాటి కాలేజీ రోజులన్నీ నెమరు వేసుకున్నారు బాల్య స్నేహం ఎప్పటికీ మరిచిపోనిది, విడిపోనిది. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి ప్రతి ఒక్కరి జీవితాల్లో చిరస్మరణీయంగా ఉంటుంది. చోడవరం గవర్నమెంటు జూనియర్ కాలేజీలో కామర్స్ గ్రూపులో ఇంటర్మీడియట్‌ను 1992-94 బ్యాచ్‌లో చదువుకున్న స్నేహితులంతా ఆదివారం కలిశారు. 30యేళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కుశల ప్రశ్నలు వేసుకుని మురిసిపోయారు. చౌడువాడలో ఏర్పాటు చేసిన కార్తీక సమారాధన పురస్కరించుకుని వీరంతా కలుసుకున్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడగా మరికొందరు ప్రజా సేవ చేస్తూ రాజకీయాల్లో రాణిస్తున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సత్కరించారు. నాటి కాలేజీ ప్రిన్సిపాల్ కామిరెడ్డి అప్పారావు, అధ్యాపకులు శ్రీనివాసరావు (కామర్స్), తిరుపతిరావు (ఇంగ్లిషు), రామారావు (సివిక్స్)ను సత్కరించారు. వారితో నాటి కాలేజీ జ్ఞాపకాలను పంచుకున్నారు. ముప్పై యేళ్లు అయిన తర్వాత కూడా తమను గుర్తుపెట్టుకొని ఆప్యాయంగా పలిచి సత్కరించిన తమ విద్యార్థులను చూసి అధ్యాపకులంతా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

18 ఏళ్లు నిండితే ఓటు హక్కు నమోదు చేసుకోండి


దేవరాపల్లిలో ఓటరు నమోదు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి: యువతి, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని దేవరాపల్లి తహసీల్దార్ పి.లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆదివారం నిర్వహించారు. కాశీపురం, నాగయ్యపేట, దేవరాపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ లక్ష్మీదేవి తనిఖీ చేశారు. కొత్తగా ఓటు హక్కు కోసం ఫారం-6 దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, పేర్లు మార్పులు, చేర్పులు కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును హక్కు పొందాలన్నారు.

గబ్బాడలో వన సమారాధన


వన సమారాధన కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకులు

నర్సీపట్నం : మండలంలో గబ్బాడ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, రావణాపల్లి రిజర్వాయర్ మాజీ చైర్మన్ లాలం అప్పారావు, పలువురు హాజరయ్యారు. అందరూ సంతోషంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. త్వరలో జరగబోయే నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేయాలని ఈ కార్యక్రమంలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేముడునాయుడు, పార్టీ నాయకులు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు మురళి

మహారాణిపేట: అనాథ శవానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వడ్డాది మాడుగుల ప్రాంతానికి చెందిన బుదిరెడ్డి ఏసుబాబు (45) తల్లిదండ్రులు చిన్నతనంలో చనిపోయారు. ఆర్.కె.బీచ్‌లో అనారోగ్యంతో బాధపడుతుంటే అక్కడున్న వారు ఇచ్చిన సమాచారం మేరకు గత నెల 26న ఏసుబాబును రెడ్ క్రాస్‌కు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం గత నెల 31న కేజీహెచ్‌లో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ ఈనెల 6వ తేదీన ఏసుబాబు తుది శ్వాస విడిచారు. ఎంవీపీ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇనస్పెక్టర్ జె.మురళీకృష్ణ సహకారంతో హోంలెస్ షెల్టర్, రెడ్ క్రాస్‌కు చెందిన మురళి అంత్యక్రియలు నిర్వహించారు. ఏసుబాబు అంత్యక్రియలకు రెడ్ క్రాస్, ఎంవీపీ పోలీసులు, హోంలెస్ షెల్టర్ (పెదవాల్తేర్) ఎంతో సహకరించాయని మురళి తెలిపారు. వారికి ధన్యవాదాలు తెలిపారు.